# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 93 క్రిష్ణా, శనివారం 27 - 12 - 2025 పేజీలు : 4 వెల. 2 /-







## ఏపీ ఫెన్సింగ్ సంఘంపై తప్పుడు ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం





**విజయవాడ, డిసెంబర్ 26 :(క్రైం కౌంటర్ న్యూస్)** ఇటీవలి సామాజిక మాధ్యమాల్లో, ప్రింట్ మీడియాలో ఆంధ్రప్రదేశ్ ఫెన్సింగ్ అసోసియేషన్ పై వచ్చిన కథనాలు కు సంబంధించి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని ఉద్దేశంతో శుక్రవారం విజయవాడలో ఏలూరు రోడ్ లోని ఒక హోటల్ నిర్వహించారు. వాస్తవం వివరణ సర్టిఫికెట్స్ ఎటువంటి ట్యాంపరింగ్ చేయబడలేదనీ అలాగే అసోసియేషన్ సెక్రటరీ స్వయంగా కరెక్షన్ చేసి ఇచ్చి ఉన్నారు. వాటికి సంబంధించిన ఛాంపియన్షిప్ అండ్ సెలక్షన్స్ ఎంట్రీలను ఆన్లైన్ ద్వారా స్వీకరించి ఉన్నాము. తేదీ, సమయంతో సహా ఆన్లైన్లో గూగుల్ డ్రైవ్ లో రికార్డు అయి ఉన్నదని అన్నారు. రిఫరీలుగా ఒడిస్సా తమిళనాడు చెందిన క్వాలిఫైడ్ టెక్నికల్ అఫీషియల్స్ వ్యవహరించారన్నారు. మొదటి నాలుగు స్థానాలు పొందిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనుటకు ఎంపికయ్యారు. ఆన్లైన్లో ఎంట్రీ లు స్వీకరించి పోటీలు నిర్వహించేటప్పుడు పాత తేదీలతో సర్టిఫికెట్లు ఇవ్వడమనేది ఎట్టి పరిస్థితులలో ను సాధ్యం కాదు ఇదీ వాస్తవం! కావున ఈ ఆరోపణ నిరాధారమైనది వాస్తవ దూరమైనది అని తెలియజేసారు. ఈ సంవత్సరం జూలై 20వ తారీఖున రాష్ట్ర సంఘం యొక్క ఎన్నికలు స్పోర్ట్స్ ఆంధ్ర ప్రదేశ్ వారి అబ్జర్వర్ అబ్జర్వేషన్ లో అలాగే ఫెన్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వారి అబ్జర్వర్ యొక్క ఆబ్జర్వేషన్ లో అత్యంత పారదర్శకంగా జరిగిందన్నారు. ఎలక్షన్స్ జనరల్ బాడీ మీటింగ్ జరిగిన తర్వాత రెండో మీటింగ్లో మొదటి మీటింగ్ మినిట్స్ ఆమోదించి ఆ రెండు కాపీలను రిజిస్టర్ ఆఫీస్ వారికు సబ్మిట్ చేసి వారి దగ్గర రెన్యూవల్ పొంది శాప్ వారి సబ్మిట్ చేసి వారితో రెన్యూవల్ పొందవలసి వున్నది ఈ ప్రాసెస్ ప్రస్తుతం జరుగుతున్నదన్నారు. వాస్తవ వివరణ ప్రస్తుతం సాప్ వెబ్సైట్ ప్రకారం ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కు సాప్ నుండి రికగ్నైజ్ అయి ఉన్నది రెన్యువల్ పెండింగ్లో ఉన్నదని క్రీడా పోటీలు నిర్వహించకపోతే జాతీయ పోటీలలో రాష్ట్ర క్రీడాకారులు వారి ప్రతిభను నిరూపించుకునే జాతీయ వేదికను కోల్పోతారు కావున క్రీడా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. క్రీడాకారులలో ప్రతిభావంతులను వెలికి తీయడమే అసోసియేషన్ల ప్రధాన కర్తవ్యం కనుక మన రాష్ట్రం నుండి జాతీయ పోటీలకు రాష్ట్ర టీమ్ పంపించవలసిన బాధ్యత మా అసోసియేషన్ పై ఉన్నది కనుక దానిలో భాగంగా పోటీలను అత్యంత పారదర్శకంగా ఎలక్ట్రానిక్ పద్ధతిలో వీడియోగ్రఫీతో తటస్థ రిఫరీల తో నిర్వహిస్తున్నామన్నారు. ఏ వేదిక పైన అయినా మాపై వచ్చిన ఆరోపణలపై ఎలక్ట్రానిక్, ఆన్లైన్, వీడియో ఆధారాలతో ఆ ఆరోపణలను నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని.. తప్పుడు ఆరోపణలు చేసిన వ్యక్తులపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడ బోమని తెలియజేసారు.

## ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు.. ఇక పూర్తిగా ఉచితం.. మంత్రి



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26,** ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత ప్రయాణం కల్పించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.. దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దివ్యాంగులకు ఏడు వరాలు ప్రకటించిన చంద్రబాబు.. ఈ క్రమంలోనే మహిళలతో పాటుగా దివ్యాంగులకు కూడా బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ప్రకటించారు. ఈ క్రమంలో దివ్యాంగులకు ఉచిత బస్సు పథకంపై కీలక అప్ డేట్ వచ్చింది. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి దీనిపై కీలక వివరాలు వెల్లడించారు.

చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు త్వరలోనే ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఈ ప్రతిపాదనలను ఇప్పటికే సంబంధిత శాఖ వద్దకు పంపించామని వెల్లడించారు. దివ్యాంగులు ప్రస్తుతం ఆర్టీసీ బస్సులలో 50 శాతం రాయితీ పొందుతున్నారని.. ఈ విధానం అమల్లోకి వస్తే పూర్తిగా ఉచితంగా ప్రయాణించవచ్చని వివరించారు.

మరోవైపు దివ్యాంగులకు ఉచిత బస్సు పథకం వర్తింపజేయాలని ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో.. రాష్ట్రంలోని సుమారు 7 లక్షల మంది దివ్యాంగులకు లబ్ధి చేకూరనుంది. దివ్యాంగులలో పాసులు ఉన్నవారు బస్సులలో ఇప్పటి వరకూ 50 శాతం రాయితీ పొందుతుండగా.. ఈ విధానం అమల్లోకి వస్తే.. ఇకపై పూర్తిగా ఉచితంగా ప్రయాణించే సౌలభ్యం ఉంటుంది. సీఎం ప్రకటన నేపథ్యంలో.. ఆర్టీసీ అధికారులు లెక్కలు తీసే పనిలో ఉన్నారు. దివ్యాంగుల పాస్‌లు ఎంతమంది పొందారు.. ఆర్టీసీకి రాయితీ రూపంలో ఎంత చెల్లించాలనే వివరాలను సిద్ధం చేస్తున్నారు.

ఏపీలో సుమారుగా 2 లక్షల మంది దివ్యాంగుల పాస్‌లు కలిగి ఉన్నారు. వీరికి బస్సులలో 50 శాతం రాయితీ వర్తిస్తోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.188 కోట్లు ఖర్చు చేస్తోంది. అయితే ఇందులో మహిళలకు ఆగస్ట్ 15 నుంచి ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చింది. ఇప్పుడు దివ్యాంగులైన మగవారికి కూడా ఉచితంగా ప్రయాణించే సదుపాయం అందుబాటులోకి రానుంది.

మరోవైపు ఏపీలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారు ఏడున్నర లక్షల మంది ఉండగా.. కేవలం 2 లక్షల మంది వరకే పాసులు తీసుకుంటున్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వస్తే.. ఈ పాసులు తీసుకునేవారి సంఖ్య పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు లెక్కలు కడుతున్నారు.

## రౌడీయిజం చేస్తే రాష్ట్రం నుంచి తరిమేస్తాం.. సీఎం చంద్రబాబు మాస్ వార్నింగ్..





**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26,** ఆంధ్రప్రదేశ్‌లో శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాజకీయ ముసుగులో రౌడీయిజం, సెటిల్‌మెంట్లు, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. అవసరమైతే అటువంటి వారిని రాష్ట్ర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. అక్రమాలకు పాల్పడితే సొంత పార్టీ వారైనా సరే జైలుకు పంపే సంస్కృతి తమదని గుర్తుచేశారు. వ్యక్తిత్వ హననానికి పాల్పడుతూ, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టే వారిపై ప్రభుత్వం నిశితంగా నిఘా ఉంచిందని తెలిపారు. తిరుపతిలో హోంమంత్రి అనితతో కలిసి ఆయన అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన నూతన జిల్లా పోలీసు కార్యాలయాన్ని సీఎం ప్రారంభించారు. అనంతరం అక్కడే ఉన్న విజిటర్స్ పుస్తకంలో సీఎం, తన అభిప్రాయాలను, సూచనలను రాశారు.

### భక్తుల భద్రతే ముఖ్యం

త్వరలో రానున్న వైకుంఠ ఏకాదశి పర్వదినం దృష్ట్యా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీసు వ్యవస్థ అత్యంత అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తిరుమల పవిత్రతను కాపాడుతూనే.. భక్తులకు పూర్తి రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులకు భద్రతా భావం కల్పించే బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు. ఈ క్రమంలో తిరుపతి ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు కృషి చేస్తున్న పోలీసులను సీఎం అభినందించారు. అలాగే ఎర్ర చందనం స్మగ్లింగ్ అరికట్టడంలో, నిందితులపై పీడీ యాక్టులు ప్రయోగించడంలో పోలీసులు చూపిస్తున్న చొరవను ఆయన కొనియాడారు.

### గత ప్రభుత్వ వైఫల్యాలపై విమర్శలు

గత ప్రభుత్వ హయాంలో వ్యవస్థలు భ్రష్టు పట్టాయని సీఎం విమర్శించారు. రోడ్లు బ్లాక్ చేయడం, హింసాత్మక ఘటనలకు పాల్పడటం వంటి సంస్కృతిని విడనాడాలని అన్నారు. గతంలో జరిగిన కొన్ని అవాంఛనీయ ఘటనలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో అటువంటివి పునరావృతం కాకుండా సీసీ కెమెరాలు, డ్రోన్ల వినియోగం పెంచాలని అధికారులను ఆదేశించారు. టెక్నాలజీని వాడుకుని నేర నియంత్రణ చేయాలని సీఎం సూచించారు. నేరస్తుల కంటే పోలీసులు ఒక అడుగు ముందుండాలని, డ్రోన్ల ద్వారా పెట్రోలింగ్ నిర్వహించి విజువల్ ఆధారాలను సేకరించాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పోలీసుల ఉనికి కనిపిస్తూనే, నేరస్తులకు తెలియకుండా నిఘా పెట్టే విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

## 16 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా నిషేధంపై కేంద్రానికి మద్రాస్ హైకోర్టు సూచన

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26,** సోషల్ మీడియా వినియోగంపై మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం కీలక సూచనలు చేసింది. ఆస్ట్రేలియాలో అమలు చేస్తున్న తరహాలోనే, 16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియాను నిషేధించేలా చట్టం తీసుకురావాలనే అంశాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.ఎస్. విజయ్ కుమార్ అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యం జస్టిస్ జి. జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఇంటర్నెట్‌లో అశ్లీల చిత్రాలు, వీడియోలు సులభంగా అందుబాటులోకి రావడం వల్ల చిన్నారుల జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని పిటిషనర్ తన వాదన వినిపించారు. చిన్నారులు ఇలాంటి కంటెంట్ చూడకుండా నిరోధించేలా సాఫ్ట్‌వేర్ అభివృద్ధి చేయాలని కోరారు.పిటిషనర్ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం, అశ్లీల కంటెంట్‌ను నియంత్రించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది. అయితే, ఇది కేవలం ఒక సూచన మాత్రమేనని, కచ్చితమైన ఆదేశం కాదని స్పష్టం చేసింది. అంతకంటే ముందుగా 16 ఏళ్ల లోపు పిల్లలను సోషల్ మీడియాకు పూర్తిగా దూరం చేసేలా చట్టం తీసుకురావడంపై కేంద్రం దృష్టి పెట్టాలని సూచించింది. అలాంటి చట్టం అమల్లోకి వచ్చేలోపు, ఈ అంశంపై చిన్నారులు, వారి తల్లిదండ్రుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, బాలల హక్కుల కమిషన్‌లను ఆదేశించింది.ఇటీవల ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఖాతాలు తెరవడాన్ని నిషేధిస్తూ చట్టం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధిస్తారు. ఈ నేపథ్యంలోనే మద్రాస్ హైకోర్టు ఈ తరహా చట్టాన్ని పరిశీలించాలని కేంద్రానికి సూచించడం గమనార్హం

## పీఎం యశస్వి పథకం కింద రూ.90.50 కోట్లు ఉపకార వేతనాలు,,,మంత్రి సవిత

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26,** రాష్ట్రంలోని విద్యార్థులకు ఏపీ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత తీపికబురు వినిపించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలలో చదివే బీసీ విద్యార్థులకు ఉపకార వేతనాలు (స్కాలర్‌షిప్) మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ విద్యాసంస్థలలో చదివే బీసీ సామాజికవర్గాలకు చెందిన విద్యార్థులకు రూ.90.50 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పీఎం యశస్వి పథకం కింద ఈ మొత్తాన్ని విడుదల చేసినట్లు మంత్రి సవిత వెల్లడించారు. అర్హులైన బీసీ, ఈబీసీ, డీఎన్‌టీ విద్యార్థులకు ఈ స్కాలర్‌షిప్స్ అందించనున్నట్లు మంత్రి వివరించారు. అలాగే బీసీ వసతి గృహాలు, గురుకులాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. మరోవైపు2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్ట్ మెట్రిక్ రెండో విడతకు రూ.69.40 కోట్లు, ప్రీ మెట్రిక్ రెండో విడత స్కాలర్ షిప్స్ కోసం రూ.21.10 కోట్లు నిధులు కేటాయించినట్లు మంత్రి సవిత వివరించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థుల చదువుకు దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ ఉద్దేశమని మంత్రి సవిత వెల్లడించారు.పీఎం యశస్వి పథకం.. యంగ్ అచీవర్స్ స్కాలర్‌షిప్ అవార్డ్ స్కీమ్ ఫర్ వైబ్రంట్ ఇండియా కింద.. దేశంలోని ఓబీసీ, ఈబీసీ, డీఎన్‌టీ (డీనోటిఫైడ్, సంచార తెగలు) సామాజిక వర్గాలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఉపకార వేతనాలు అందిస్తోంది. గుర్తింపు పొందిన పాఠశాలలు, కాలేజీల్లో 9, 10 వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఏడాదికి రూ.75 వేల వరకూ ప్రోత్సాహకంగా అందిస్తోంది. అలాగే 11, 12 తరగతి చదువుకున్న విద్యార్థులకు రూ.1,25,000 వరకు ప్రోత్సాహకంగా స్కాలర్ షిప్స్



అందిస్తోంది.అయితే ఇందుకు కుటుంబ వార్షికాదాయం రెండున్నర లక్షల లోపు ఉండాలి. ఒక కుటుంబంలో ఇద్దరిక మించి ఇవ్వరు. ఇందులో 30 శాతం బాలికలకు ఇస్తారు. పీఎం యశస్వి పథకం కింద ఒకసారి ఎంపికైన విద్యార్థులకు.. వారి ప్రతిభ మేరకు, పునరుద్ధరణ ఆధారంగా కోర్సు ముగిసేవరకు ఈ ఉపకార వేతనం అందుతుంది. అలాగే విద్యార్థి ఫెయిల్ అయితే, ఒకవేళ మరుసటి సెమిస్టర్‌కు ప్రమోట్ కాకపోతే.. ఈ సాయం నిలిపివేస్తారు.

## రుషికొండ భవనాలను హోటళ్లకు ఇవ్వొద్దు..



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నంలోని రుషికొండ భవనాల విషయంలో తీసుకుంటున్న నిర్ణయాలపై రాజకీయంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇటీవల సమావేశమైన మంత్రుల కమిటీ, ఈ భవనాలను అలాగే వాటి దిగువన ఉన్న కొంత భూమిని ప్రముఖ అంతర్జాతీయ హోటల్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని ప్రాథమికంగా చర్చించింది. దీని ద్వారా ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు ఈ నెల 28వ తేదీన జరగబోయే కీలక సమావేశంలో హోటళ్ల కేటాయింపుపై తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సమాచారం.

అయితే, ప్రభుత్వ ప్రతిపాదనలపై భారతీయ జనతా పార్టీ (%దీబీ%) ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రుషికొండ భవనాలను కేవలం ఆదాయ వనరుగా మాత్రమే చూడటం సరికాదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాంతం విశాఖ నగరానికి ఒక మణిహారం లాంటిదని, ఇక్కడ వాణిజ్య కార్యకలాపాలు పెరిగితే ప్రకృతి అందాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా, ముందుగా స్థానిక ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

విష్ణు కుమార్ రాజు మరిన్ని సూచనలు చేస్తూ, ఈ భవనాలను ప్రైవేటు హోటళ్లకు అప్పగిస్తే అవి సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండవని పేర్కొన్నారు. సామాన్యులు ఆ ప్రాంతానికి వెళ్లే అవకాశం కోల్పోతారని, అది కేవలం ధనికులకే పరిమితమవుతుందని హెచ్చరించారు. రుషికొండను పర్యాటక కేంద్రంగా కాకుండా, పవిత్రమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడం కంటే ప్రజల ప్రయోజనాలే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు.

రుషికొండ భవనాల సముదాయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం కి అప్పగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఆ ప్రాంతాన్ని ఒక ఆధ్యాత్మిక నగరంగా మార్చడం ద్వారా విశాఖకు కొత్త గుర్తింపు వస్తుందని సూచించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల వల్ల పర్యావరణం కూడా పరిరక్షించబడుతుందని, భక్తులకు మంచి అనుభూతి కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. మరి ఈ నెల 28న ప్రభుత్వం ఈ విమర్శలను పరిగణనలోకి తీసుకుంటుందో లేక హోటళ్ల కేటాయింపుకే మొగ్గు చూపుతుందో చూడాలి.

## ఆరావళి గుండెల్లో మైనింగ్ సెగ.. ఏడేళ్లలో వేల సంఖ్యలో అక్రమ కేసులు



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26, భారతదేశ పురాతన పర్వత శ్రేణులైన ఆరావళి ప్రాంతంలో అక్రమ మైనింగ్ వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో కీలక పాత్ర పోషించే ఈ పర్వతాల్లో నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరగడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. రాజస్థాన్‌లో విస్తరించి ఉన్న ఈ పర్వత జిల్లాల్లో మైనింగ్ మాఫియా ఏ స్థాయిలో రెచ్చిపోతోందో తాజాగా వెల్లడైన గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా మరియు పర్యావరణ పరంగా పెద్ద వివాదానికి దారి తీసింది.గడిచిన ఏడేళ్ల కాలంలో రాజస్థాన్ రాష్ట్రవ్యాప్తంగా అక్రమ మైనింగ్‌కు సంబంధించి నమోదైన కేసుల వివరాలు దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. మొత్తం రాష్ట్రంలో ఇప్పటివరకు 7,173 ఎఫ్.ఐ.ఆర్ (%ఖీ×=%)లు రిజిస్టర్ కాగా, అందులో మెజారిటీ కేసులు ఆరావళి పర్వత ప్రాంతాల నుంచే రావడం గమనార్హం. ప్రభుత్వం ఎన్ని నిఘా చర్యలు చేపడుతున్నా, క్షేత్రస్థాయిలో అక్రమ తవ్వకాలు ఆగడం లేదని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి. పర్వతాలను పిండి చేస్తున్న ఈ అక్రమ దందా వల్ల పర్యావరణ వ్యవస్థకు కోలుకోలేని దెబ్బ తగులుతోంది.కేవలం ఆరావళి పర్వతాలు విస్తరించి ఉన్న జిల్లాలను పరిగణనలోకి తీసుకుంటే, అక్కడ సుమారు 4,181 అక్రమ మైనింగ్ కేసులు నమోదైనట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. రాష్ట్రం మొత్తం మీద దాదాపు 71 వేల అక్రమ మైనింగ్ ఘటనలు వెలుగులోకి రాగా, అందులో కేవలం ఆరావళి ప్రభావిత జిల్లాల్లోనే 40 వేల ఘటనలు చోటు చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంటే రాష్ట్రంలోని మొత్తం అక్రమ మైనింగ్ వ్యవహారాల్లో సగానికి పైగా వాటా ఈ సున్నితమైన పర్వత ప్రాంతాల నుంచే ఉండటం గమనార్హం. ఈ అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోవడమే కాకుండా, అడవుల విస్తీర్ణం తగ్గి వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. సుప్రీంకోర్టు గతంలోనే ఆరావళి పరిరక్షణపై కఠిన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, స్థానిక యంత్రాంగం వైఫల్యం వల్ల తవ్వకాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే ప్రభుత్వం స్పందించి కఠినమైన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో ఈ పర్వత శ్రేణులు మ్యాప్ నుంచి మాయమైపోయే ప్రమాదం ఉందని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు.

# రంగా వర్ధంతి వేళ టీడీపీపై అంబటి నిప్పులు.. 'ధైర్యవంతుడిని పొట్టనబెట్టుకున్నారు' అంటూ ట్వీట్!



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26, దివంగత కాపు సామాజికవర్గ నేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా 37వ వర్ధంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నివాళులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి రాంబాబు సోషల్ మీడియా వేదికగా రంగాకు ఘన నివాళులు అర్పించారు. రంగా ఆశయాలను స్మరించుకోవడంతో పాటు, నాటి రాజకీయ పరిస్థితులను గుర్తు చేస్తూ ఆయన చేసిన ట్వీట్ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రంగా లేని లోటు కాపు సామాజికవర్గానికి తీరనిదని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. అంబటి రాంబాబు తన ట్వీట్‌లో తెలుగుదేశం పార్టీని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించారు. "దీక్షలో ఉన్న ధీరుడిని టీడీపీ గూండాలు హతమార్చి నేటికి 37 సంవత్సరాలు.. జోహార్ వంగవీటి మోహన రంగా!" అంటూ తనదైన శైలిలో ధ్వజమెత్తారు. రంగాను అప్పట్లో కుట్రపూరితంగా అంతం చేశారని, ఆ నెత్తుటి మరకలు టీడీపీని ఎప్పటికీ వీడవని ఆయన ఘాటు వ్యాఖ్యలు చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వ్యక్తిపై దాడి చేయడం హేయమైన చర్య అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు మరియు కార్యకర్తలు విజయవాడతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో రంగా విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల పెన్నిధిగా పేరుగాంచిన రంగా, సమాజంలోని అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. రంగా వారసత్వాన్ని మరియు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని వైసీపీ నేతలు ఈ సందర్భంగా స్పష్టం చేశారు. వంగవీటి రంగా వర్ధంతి కార్యక్రమాలు కేవలం రాజకీయ రంగు పులుముకోవడమే కాకుండా, కాపు సామాజికవర్గంలో ఉన్న ఐక్యతను మరోసారి చాటిచెప్పేలా సాగుతున్నాయి. విజయవాడ నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాజకీయ విమర్శలు ఎలా ఉన్నప్పటికీ, రంగా అభిమానులు మాత్రం తమ నేతను స్మరించుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో రంగా పేరు ఇప్పటికీ ఒక ప్రభంజనంలా కొనసాగుతూనే ఉండటం విశేషం.

## వంగవీటి వారసులపై వైసీపీ కన్ను? రంగా వర్ధంతి వేళ ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ!



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26, వంగవీటి మోహన రంగా వర్ధంతిని పురస్కరించుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా స్పందించడం రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా రంగా ఆశయాలను, ఆయన పోరాట పటిమను కొనియాడుతూ జగన్ చేసిన ట్వీట్ వెనుక లోతైన రాజకీయ వ్యూహం ఉందనే చర్చ జరుగుతోంది. కాపు సామాజికవర్గంలో చెక్కుచెదరని ఆదరణ ఉన్న రంగా ఇమేజ్‌ను సొంతం చేసుకోవడం ద్వారా, ఆ వర్గం ఓటు బ్యాంకును మళ్ళీ తమవైపు తిప్పుకోవాలని వైసీపీ భావిస్తున్నట్లు కనిపిస్తోంది.

రంగా కుమారుడు వంగవీటి రాధాకృష్ణ గతంలో వైసీపీలో కీలక నేతగా ఉండి, ఆ తర్వాత మనస్పర్థల కారణంగా పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. రాధా ప్రస్తుతం టీడీపీలోనే కొనసాగుతున్నప్పటికీ, ఆయన రాజకీయ భవిష్యత్తుపై కొంత సందిగ్ధత నెలకొంది. ఈ తరుణంలో రంగా కుమార్తె వంగవీటి ఆశాకిరణ్ రాజకీయాల్లో యాక్టివ్ కావడం కొత్త సమీకరణాలకు దారితీస్తోంది. విజయవాడ కేంద్రంగా ఆమె నిర్వహిస్తున్న కార్యక్రమాలు మరియు ప్రజలతో మమేకమవుతున్న తీరును గమనిస్తుంటే, వంగవీటి కుటుంబం నుంచి మరో బలమైన నాయకత్వం రాబోతోందని స్పష్టమవుతోంది.

ఇటీవల మీడియా ప్రతినిధులు ఆశాకిరణ్‌ను భవిష్యత్తు రాజకీయ ప్రయాణం గురించి ప్రశ్నించగా, ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏ పార్టీలో చేరాలనేది వ్యక్తిగత నిర్ణయం కాదని, "రాధారంగా మిత్రమండలి" ఇచ్చే సలహాలు, సూచనల మేరకే నడుచుకుంటానని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు రంగా అభిమానుల్లో కొత్త ఆశలు రేకెత్తించాయి. తమ నాయకుడి వారసురాలు సరైన వేదికను ఎంచుకోవాలని వారు కోరుకుంటుండగా, రాధారంగా మిత్రమండలి తీసుకునే నిర్ణయం వంగవీటి వారసుల రాజకీయ భవిష్యత్తును శాసించే అవకాశం కనిపిస్తోంది.

వైసీపీ అధిష్టానం ఆశాకిరణ్‌ను పార్టీలోకి ఆహ్వానించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బెజవాడ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి ఉన్న పట్టును ఉపయోగించుకుని, టీడీపీ-జనసేన కూటమిని దెబ్బకొట్టాలని జగన్ వ్యూహరచన చేస్తున్నట్లు సమాచారం. ఒకవేళ ఆశాకిరణ్ వైసీపీ గూటికి చేరితే, అది కోస్తాంధ్ర రాజకీయాల్లో పెను మార్పులకు కారణం కావచ్చు. అయితే, ఆమె అన్న రాధా బాటలో నడుస్తారా లేక జగన్ ఆఫర్‌కు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి.

# బర్త్ డే పార్టీకి పిలిచి..సహోద్యోగుల గ్యాంగ్ రేప్



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 26, రాజస్థాన్‌లోని పర్యాటక నగరం ఉదయపూర్‌లో అత్యంత దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. ఒక ప్రైవేట్ ఐటీ కంపెనీలో మేనేజర్‌గా పని చేస్తున్న మహిళపై అదే కంపెనీకి చెందిన సీఈఓ ఎగ్జిక్యూటివ్ హెడ్ భర్త కలిసి కదులుతున్న కారులో సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ అకృత్యం జరుగుతున్న సమయంలో కంపెనీకి చెందిన మహిళా ఎగ్జిక్యూటివ్ హెడ్ కూడా కారులోనే ఉండటం గమనార్హం. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

పుట్టినరోజు వేడుకల్లో ఘాతుకం..

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ఘటన డిసెంబర్ 20వ తేదీన జరిగింది. కంపెనీ సీఈఓ పుట్టినరోజు, నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శోభాగ్‌పురాలోని ఒక హోటల్‌లో పార్టీ ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన ఈ వేడుకలు అర్ధరాత్రి 1.30 వరకు కొనసాగాయి. అయితే పార్టీలో మద్యం సేవించిన మేనేజర్ అపస్మారక స్థితికి చేరుకుంది. అతిథులందరూ వెళ్లిపోయిన తర్వాత నిందితులు ముగ్గురు కలిసి ఆమెను ఇంటి వద్ద వదిలేస్తామని నమ్మించి కారులో ఎక్కించుకున్నారు. కారు సుఖేర్ ప్రాంతానికి చేరుకున్నాక.. నిందితులు ఒక షాపు వద్ద ఆపి బాధితురాలికి సిగరెట్ వంటి మత్తు పదార్థాన్ని బలవంతంగా తినిపించారు. దీంతో ఆమె పూర్తిగా స్పృహ కోల్పోయింది. బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో.. తనకు స్పృహ వచ్చినప్పుడు సీఈఓ తనపై లైంగిక వేధింపులకు పాల్పడగా.. ఎగ్జిక్యూటివ్ హెడ్ భర్త అత్యాచారం చేశాడని పేర్కొంది. తెల్లవారుజామున 5 గంటల వరకు ఆమెను కారులోనే తిప్పుతూ ఈ అరాచకానికి ఒడిగట్టారు. చివరకు ఆమెను ఇంటి వద్ద వదిలి వెళ్లారు. ఈ ఘటన జరిగిన మూడు రోజుల తర్వాత బాధితురాలు ధైర్యం చేసి పోలీసులను ఆశ్రయించింది. అయితే ఆమె ఫిర్యాదుకు బలం చేకూరుస్తూ.. కారులోని డాష్‌క్యామ్ ఈ ఘోరాన్నంతా రికార్డు చేసింది. కారులో జరిగిన సంభాషణలు, వీడియో ఫుటేజీని బాధితురాలు పరిశీలించి పోలీసులకు ఆధారంగా సమర్పించింది. ఈ కీలక సాక్ష్యంతో కేసు మలుపు తిరిగింది. మహిళా నేరాల విభాగం అదనపు ఎస్పీ మాధురీ వర్మ నేతృత్వంలో దర్యాప్తు ప్రారంభమైంది. ఉదయపూర్ ఎస్పీ యోగేశ్ గోయల్ ఈ ఘటనను ధృవీకరిస్తూ.. సీఈఓతో పాటు ఒక మహిళా ఉద్యోగిని, ఆమె భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించామని, రిపోర్టు కోసం వేచి చూస్తున్నామని వెల్లడించారు. బాధితురాలి గోప్యతను కాపాడేందుకు ఆమె వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు.



## మత్స్యకారులకు 40 శాతం సబ్సిడీతో ఆటోలు: మంత్రి డోలా

మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మత్స్యకారులకు సంప్రదాయ వలలను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్ ధర రూ.2,43,700 కాగా.. ఏడుగురు మత్స్యకారులకు వలలు అందించినట్లు తెలిపారు. త్వరలో మత్స్యకారులకు ఇంజిన్‌తో పాటు బోట్లను అందిస్తామని తెలిపారు. దీని ధర రూ.52 లక్షల వరకు ఉంటుందని తెలిపారు.

# భారత్ విశ్వగురు కావాలి భారతీయుల రక్తంలోనే ధర్మ దృష్టి




**విజ్ఞానం అంటేనే ప్రపంచ శ్రేయస్సు**

**విజ్ఞాన శాస్త్రానికి వివేకం, నైతిక విలువల్ని జోడించాలి..**

**ఆర్ఎస్ఎస్ చీఫ్ భాగవత్ ఉద్ఘాటన**

క్రైం కౌంటర్ న్యూస తిరుపతి, డిసెంబరు 26 భారత్ విశ్వగురు కావాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ ఆకాంక్షించారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. "భారతీయుల రక్తంలోనే ధర్మ దృష్టి ఉంది. ప్రకృతిలో మనుషులే కాకుండా జంతువులు, పక్షులు, చెట్లు సహా అన్ని ప్రాణులూ సుఖంగా జీవించాలి. అదే నిజమైన అభివృద్ధి. విశ్వానికి ఏదో చేయాలన్న తపన భారత్‌కు ఉంది. త్వరలోనే విశ్వ గురు స్థానాన్ని అధిరోహించి తన పూర్వ వైభవాన్ని సంతరించుకుని తీరుతుంది. జ్ఞాన పిపాసకు వివేకం తోడు కావాలి. విజ్ఞానమంటే ప్రపంచ శ్రేయస్సు అనే భావన అందరిలో కలగాలి. ప్రతి వ్యక్తి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసం పొంది జీవితంలో ఉన్నత స్థితికి చేరుకోవాలి. ఈ దిశగా విజ్ఞాన భారతి బాధ్యత తీసుకుని అధ్యాపకులతో, శాస్త్ర పరిశోధకులతో సదస్సులు, చర్చా గోష్ఠులు నిర్వహించడం అభినందనీయం." అని మోహన్ భాగవత్ అన్నారు. మనిషికి సమాజంపై దృష్టి, చింతన ఉండాలని, అలాగే సమాజానికి ప్రకృతిపై దృష్టి ఉండాలన్నారు. సైన్స్ మంచిదే కానీ దానికి వివేకం, నైతిక విలువలు కూడా తోడు కావాలని అభిప్రాయపడ్డారు. విజ్ఞానాన్ని మంచికి ఎలా వాడాలన్న బుద్ధి భారతీయులకు ఉందని, కానీ ఇతరుల్లో చాలామందికి ఆ ఆలోచన లేదన్నారు. మాతృభాషలో చదువు మంచిదని, ఎవరికి ఏ భాష తెలుసో, ఆ భాషలోనే వారికి జ్ఞానం, విజ్ఞానం అందించాలని కోరారు. పది వేల ఏళ్లుగా మనం పొలాలు సాగు చేస్తున్నామని, అయితే ఎక్కడా భూమి పాడవకపోవడానికి మన ప్రాకృతిక సాగు విధానాలే కారణాలన్నారు. కాగా, సుమారు 3500 స్టార్టప్‌లతో దేశం శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు దూసుకెళుతోందని, గ్లోబల్ ఇండెక్స్‌లో 81వ ర్యాంకు నుంచి భారత్ 38వ ర్యాంకుకు చేరుకుందని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి జితేందర్ సింగ్ అన్నారు. కాగా, సదస్సులో విజ్ఞాన భారతి చైర్మన్ శేఖర్ పాండే, డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీశ్ రెడ్డి, జాతీయ సంస్కృత వర్శిటీ వీసీ ప్రొఫెసర్ జీఎసఆర్‌కే మూర్తి తదితరులతోపాటు దేశవ్యాప్తంగా వివిధ ఐఐటీలు, ఐసర్‌లు, ఇతర ఉన్నత విద్యా సంస్థలకు చెందిన ప్రొఫెసర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

# 20 మంది వీర బాలలకు పురస్కారాల ప్రదానం

క్రైం కౌంటర్ న్యూస్ న్యూఢిల్లీ, డిసెంబరు 26: వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన పిల్లలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కారా'లను బహూకరించారు. ధైర్యసాహసాలు, సామాజిక సేవలు, పర్యావరణం, క్రీడలు, కళలు–సంస్కృతి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో అసాధారణ విజయాలను సాధించినందుకు వీటిని అందజేశారు. వీర్ బాల్ దివ్‌సను పురస్కరించుకొని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో 18 రాష్ట్రాలకు చెందిన 20 మంది పిల్లలకు వీటిని ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పర్వతరోహకుడు విశ్వనాథ్ కార్తికేయ్, ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లాకు చెందిన 17 ఏళ్ల పారా అథ్లెట్ క్రీడాకారిణి శివాని హెూసూరు ఉప్పర ఉన్నారు. రికార్డులు సృష్టిస్తున్న క్రికెట్ క్రీడాకారుడు వైభవ్ సూర్యవంశీ కూడా పురస్కారం అందుకున్నాడు.

విశ్వనాథ్ పేరిట 4 ప్రపంచ రికార్డులు

తెలంగాణలోని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన 16 ఏళ్ల పడకంటి విశ్వనాథ్ కార్తికేయ్ పర్వతరోహకుడు. ఈ ఏడాది ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడం ద్వారా 'సెవెన్ సమ్మిట్స్' ఛాలెంజ్‌ను పూర్తి చేసిన అతి పిన్న వయస్కుడైన భారతీయుడిగా నిలిచాడు. విశ్వనాథ్ పేరిట నాలుగు ప్రపంచ రికార్డులు ఉన్నాయి. అందులో ఎల్‌బ్రూస్ పర్వతాన్ని కేవలం 24 గంటల్లోనే ధిరోహించిన అతిపిన్న వయస్కుడిగా రికార్డు కూడా ఒకటి. విశ్వనాథ్ ఆరు ఖండాల్లోని 20కి పైగా పర్వతాలను అధిరోహించాడు.

పారా అథ్లెటిక్స్‌లో శివాని సత్తా..

దివ్యాంగురాలైన ఏపీకి చెందిన 17 ఏళ్ల శివాని థాయ్‌లాండ్‌లో జరిగిన వరల్డ్ ఎబిలిటీ స్పోర్ట్స్ గేమ్స్(2023) అండర్ 20 విభాగంలో జావెలిన్ ఎఫ్45, షాట్‌పుట్ క్రీడల్లో విజేతగా నిలిచింది. గతేడాది బెంగళూరులో నిర్వహించిన నేషనల్ జూనియర్ అండ్ సబ్ జూనియర్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స అండర్ 17 విభాగంలో 100 మీటర్ల పరుగు, జావెలిన్ త్రో, షాట్ పుట్‌లో మూడు బంగారు పతకాలను గెలిచింది. 12వ నేషనల్ ఛాంపియన్‌షిప్స(2023) మహిళల జావెలిన్ త్రోలో రజత పతకం సాధించింది.

ఆపరేషన్ సిందూర్‌లో 'చిట్టి పౌర యోధుడు'




ఆపరేషన్ సిందూర్ సమయంలో దేశానికి తన వంతు సేవలు అందించి సైనికుల ప్రశంసలు అందుకున్న ఓ పదేళ్ల బాలుడు ఇప్పుడు రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నాడు. పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా చక్ తరన్ వాలీ గ్రామానికి చెందిన శ్రావణ్ సింగ్.. ఆపరేషన్ సిందూర్ సమయంలో సరిహద్దుల్లో విధులు నిర్వర్తిస్తున్న సైనికులకు నీరు, పాలు, టీ, లస్సీ అందజేశాడు. బాలుడి దేశభక్తిని చూసి సైనికులు మురిసిపోయారు. 'యంగెస్ట్ సివిల్ వారియర్' పేరుతో సన్మానించారు.

జెన్–జీతో వికసిత్ భారత్ సాకారం : ప్రధాని మోదీ

జెన్–జీపై తనకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వారి సామర్థ్యాలు, క్రమశిక్షణ, కష్టపడే తత్వం వికసిత్ భారత్ కలను సాకారం చేస్తాయని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన 'వీర్ బాల్ దివస్' కార్యక్రమంలో మోదీ పాల్గొని మాట్లాడారు. యువత కలలు, ఆకాంక్షలే దేశ దశ, దిశను నిర్ణయిస్తాయని అభిప్రాయపడ్డారు. యువత స్వల్పకాలిక ఆకర్షణల మోజులో పడకుండా లక్ష్యం వైపు దూసుకెళ్లాలని సూచించారు. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక యువతకు ఎన్నో రంగాల్లో అవకాశాలను కల్పించామని ఆయన చెప్పుకొచ్చారు. ఎవరు పెద్ద.. ఎవరు చిన్న అనేది వయసు నిర్ణయించదని, చేసే పనులు సాధించే విజయాలే నిర్ణయిస్తామన్నారు.

# కాలుష్యంపై కొరడా నియంత్రణ దిశగా కదిలిన యంత్రాంగం




**మూడు కంపెనీలకు పీసీబీ నోటీసులు**

**మరికొన్ని కంపెనీలకు నేడో, రేపో జారీ**

**భారీగా పర్యావరణ పరిహారం వసూలుకు నిర్ణయం**

**కాలుష్యం వెదజల్లే వాహనాలకు రూ.7.45 లక్షల జరిమానా**

**మరోవైపు టాస్క్‌ఫోర్స్ తనిఖీలు**

క్రైం కౌంటర్ న్యూస్ నగరంలో కాలుష్యం పెంచే పరిశ్రమలపై కాలుష్య నియంత్రణమండలి అధికారులు కొరడా ఝుళిపించారు. గత కొద్దిరోజులుగా చేపట్టిన తనిఖీల మేరకు మూడు పెద్ద పరిశ్రమలకు నోటీసులు జారీ చేశారు. గాలి నాణ్యత సూచీలు పెరగడం ద్వారా ప్రజారోగ్యంపై ప్రభావం పడడానికి కారణమైన పరిశ్రమలు పర్యావరణ పరిహారం చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఒక్కో కంపెనీ రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. అయితే నోటీసులు జారీచేసిన కంపెనీల వివరాలను మాత్రం అధికారులు వెల్లడించలేదు. నగరం, పరిసరాల్లో కాలుష్యం పెరగడంతో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. ఇది ఆన్‌లైన్ యాంబియంట్ ఎయిర్‌క్వాలిటీ యంత్రాల ద్వారా బహిర్గతమవుతోంది. దేశ రాజధాని ఢిల్లీ కంటే నగరంలో గాలి నాణ్యత క్షీణించిందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల 21వ తేదీ నుంచి 20 మంది అధికారులు ఆరు బృందాలుగా ఏర్పడి శుక్రవారం వరకు పలు పరిశ్రమలు, సంస్థలను తనిఖీ చేశారు. దీనికి అనుగుణంగా శుక్రవారం మూడు కంపెనీలకు నోటీసులు జారీచేసిన పీసీబీ, ఒకటి, రెండు రోజుల్లో మరిన్ని కంపెనీలకు నోటీసులు ఇవ్వనున్నారు. ఆ తరువాత పర్యావరణ పరిహారం వసూలు చేయాలని యోచిస్తున్నారు.

ప్రభుత్వ ప్రత్యేక దృష్టి నగరంలో గాలి నాణ్యత క్షీణించడంపై ఇటీవల ప్రభుత్వం సీరియస్ అయింది. ఈ నేపథ్యంలో పలు శాఖలతో కలెక్టర్ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటుచేశారు. పీసీబీతోపాటు రవాణా, ఆర్టీసీ, ఏపీఐఐసీ, జీవీఎంసీ, పౌర సరఫరాల శాఖాధికారులు కలిసి పరిశ్రమలను తనిఖీ చేశారు. విశాఖ పోర్టు, గంగవరం పోర్టు, హెచ్‌పీసీఎల్, ఉక్కు కర్మాగారం, జింక్ గేట్ ప్రాంతాలతోపాటు నగరంలో పలుచోట్ల వాహనాలను తనిఖీ చేశారు. కాలుష్య కారక వాహనాలు, అధికలోడు, టార్పాలిన్లు లేకుండా రవాణా చేస్తున్న వాహనాలకు 78 ఈ చలాన్లు నమోదుచేసి రూ.7.45 లక్షల జరిమానా విధించారు. తనిఖీలో పది ఆర్టీసీ బస్సుల్లో లోపాలు గుర్తించారు. వాయు కాలుష్య ఉల్లంఘనలు గుర్తించడానికి జీవీఎంసీ 10 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను ఏర్పాటుచేసింది. ఈ బృందాలు శుక్రవారం నగరంలో తనిఖీలు నిర్వహించి 51 ఉల్లంఘనలు గుర్తించి 39 కేసులు నమోదుచేశాయి. నగరంలో రోడ్డు పక్కన చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు తవ్విన ప్రాంతాల్లో మట్టి నుంచి ధూళి రాకుండా నీటితో తడిపే ప్రక్రియ చేపట్టారు. పోర్టు పరిసర రోడ్ల నుంచి ధూళి రేగకుండా నీటిని స్ప్రే చేశారు. వాహనాలు వినియోగించే డీజల్, పెట్రోల్‌లో స్వచ్ఛత నిర్ధారణను జిల్లా పౌరసరఫరాల అధికారి వి.భాస్కర్ చేపట్టారు. కాలుష్యం వెదజల్లి తద్వారా గాలి నాణ్యత క్షీణించడానికి కారణమైన పరిశ్రమలు, సంస్థల్లో నిరంతర తనిఖీలు జరుగుతాయని కాలుష్య నియంత్రణమండలి ఈఈ పీవీ ముకుందరావు తెలిపారు. రోజువారీ నివేదికలను కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు.

# దేశానికి జనాభాయే ఆస్తి

**ప్రతి జంటా ముగ్గురు పిల్లలను కనాలి**

**వృద్ధ ప్రపంచంలో యువ దేశం మనదే: సీఎం**

**ప్రపంచవ్యాప్తంగా 5 కోట్ల భారతీయులు**

**తలసరి ఆదాయంలో మన వాళ్లే టాప్**

**2047 నాటికి ప్రపంచంలో నం.1 మనమే**

**మన కుటుంబం, విలువలు గొప్పవి**

**పిల్లలకు పురాణాల గురించి చెప్పాలి**

**స్పైడర్‌మ్యాన్ కన్నా హనుమాన్ బలవంతుడు**

**భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో సీఎం**



క్రైం కౌంటర్ న్యూస్ తిరుపతి, డిసెంబరు 26 : "భారతీయ కుటుంబ వ్యవస్థ అద్భుతమైనది. మన కుటుంబ విలువలు ప్రపంచంలో మరెక్కడా ఉండవు" అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శుక్రవారం తిరుపతిలో విజ్ఞాన భారతి సంస్థ నిర్వహిస్తున్న భారతీయ విజ్ఞాన సమ్మేళనాన్ని ఆయన ఆర్ఎసఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి జితేందర్ సింగ్‌తో కలసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు ప్రసంగిస్తూ, మన కుటుంబ వ్యవస్థ అందరికీ భద్రత కల్పించేలా ఉంటుందని కొనియాడారు. మన కుటుంబ విలువల పట్ల గర్విస్తున్నానన్నారు. "దేశంలో ఇప్పుడు జనాభాయే ఆస్తిగా మారింది. వృద్ధుల జనాభా పెరిగిపోయి పలు దేశాలు ఇబ్బందులు పడుతుండగా, భారత్‌లో మాత్రం యువజనం అధికంగా ఉంది. ప్రపంచంలోని వివిధ దేశాల్లో సుమారు ఐదు కోట్ల మంది భారతీయులు ఉన్నారు. ఏ దేశంలోనైనా తలసరి ఆదాయం మనవారికే అధికంగా ఉంటోంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాల్లో జనాభా తగ్గుముఖం పడుతోంది. కానీ, భారత్‌లో మాత్రం 14.8 శాతం పెరిగింది." అని చంద్రబాబు తెలిపారు. మానవ వనరుల లోటును పూడ్చుకోవడానికి దేశంలో ప్రతి జంటా ముగ్గురు పిల్లల్ని కనాలన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.

"మన యువతకు, పిల్లలకు స్పైడర్ మ్యాన్, బ్యాట్ మ్యాన్‌లకు బదులుగా మన పురాణ పురుషుల గురించి చెప్పాలి. స్పైడర్‌మ్యాన్ కంటే హనుమంతుడు బలవంతుడు. బ్యాట్‌మ్యాన్ కంటే అర్జునుడు గొప్ప యోధుడు. హాలీవుడ్ హీరోల కంటే మన పురాణ పురుషులు గొప్పవారు. ఈ విషయాలు పిల్లలకు చెప్పాల్సిన అవసరం ఉంది. అలాగే కృష్ణుడి మహిమల గురించి, శివుడి మహత్తుల గురించి, రాముడికి మించిన రాజు లేడనే దాని గురించి చెప్పాల్సి ఉంది. హాలీవుడ్ సినిమా అవతార్ కంటే కూడా మహాభారతం, రామాయణం చాలా గొప్పవని చెప్పాలి. అదే సమయంలో బకాసురుడు, కంసరాజు వంటి వారి గురించి కూడా చెప్పాలి. సమాజంలో మంచి చెడుల వ్యత్యాసం తెలియాలంటే ఇవన్నీ చెప్పాలి."

ప్రపంచానికి జ్ఞానం పంచాం

"జ్ఞానం, విజ్ఞానం మన దేశానికి కొత్త కావు. ప్రాచీన కాలంలోనే భారతదేశం విజ్ఞానాన్ని సముపార్జించిపరిఢవిల్లింది. 4500 ఏళ్లకు ముందే విలసిల్లిన హరప్పా, మెహంజదారో నాగరికతలు, అప్పట్లోనే మన అర్బన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ పాటవాలను చాటి చెప్పాయి. 2900 ఏళ్ల క్రితమే ఇక్కడ యోగను ఆచరించాం. ఇప్పుడు 150 దేశాలు యోగాను ఆచరిస్తున్నాయి. 2600ఏళ్ల మునుపే ఆయుర్వేదం ద్వారా వైద్యసేవలు అందించాం. నలంద, తక్షశిల వంటి విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసుకుని ఆధునిక విద్యను అందించాం. సున్నాను కనుగొన్నదీ, చదరంగం క్రీడను ప్రపంచానికి అందించిందీ భారతీయులే. ఖగోళ శాస్త్రంలో ఆర్యభట్ట, గణితంలో భాస్కరాచార్య, వైద్యంలో చరకుడు, ధన్వంతరి, ఆర్థిక శాస్త్రంలో కౌటిల్యుడు వంటి గొప్పవారంతా ఇక్కడి వారే. 2వేల ఏళ్ల వెనక్కి వెళితే ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలుగా పరిగణిస్తున్న అమెరికా, జపాన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ వంటివి ఎంతో వెనుకబడి ఉన్నాయి. అప్పట్లోనే మన దేశ జీడీపీ ప్రపంచ జీడీపీలో 40శాతం ఉండేది. నాలెడ్జి ఎకానమీలో భారత్ ఎప్పుడూ సూపర్ పవర్‌గానే ఉండేది. కానీ వలస పాలన, మన ఆర్థిక విధానాల కారణంగా వెనుకబడ్డాం. 1991లో ఆర్థిక సంస్కరణలు మొదలవ్వగానే మనం అందిపుచ్చుకున్నాం."

2047 నాటికి మనమే టాప్

"మాజీ ప్రధాని వాజపేయి తెచ్చిన సంస్కరణలతో దేశాభివృద్ధికి బలమైన పునాదులు పడ్డాయి. ఇప్పుడు ఐన్ఫర్మేషన్ టెక్నాలజీలో మనం బలంగా ఉన్నాం. ప్రపంచంలో పేరున్న ఐటీ కంపెనీలకు భారతీయులే సార?థ్యం వహిస్తున్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలో నంబర్ వన్ స్థానానికి చేరుకుంటుంది. రాబోయే అనేక శతాబ్దాల పాటు భవిష్యత్తు భారత్‌దే. ఆ దిశగా మోదీ స్థిరమైన ప్రభుత్వంతో పాటు, ఆర్ఎసఎస్ చీఫ్ మోహన్ భగవత్ వంటి వ్యక్తులు తగిన వేదిక రూపొందిస్తున్నారు. ఈ సమయంలోనే సమాజంలో పేద, ధనిక మధ్య అంతరాలు తగ్గే విధంగా వ్యవస్థను రూపొందించుకోవాల్సిన అవసరం ఉంది. భారతీయత గురించి చర్చించుకోవడానికి భారతీయ విజ్ఞాన సమ్మేళనం మంచి వేదిక. సంస్కృతి, సంప్రదాయాలను నిలబెడుతూ దేశాభివృద్ధి కోసం ఆర్ఎసఎస్ చీఫ్ కృషి చేస్తున్నారు." అని చంద్రబాబు అన్నారు. క్వాంటం కంప్యూటింగ్, ఏఐ వంటి వాటితో పాటు గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. త్వరలోనే ఏపీ నుంచి క్వాంటమ్ కంప్యూటర్ ఆపరేట్ చేయబోతున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# సినిమా



## ఛాంపియన్ సక్సెస్ మీట్‌లో రోషన్

స్వప్న సినిమాస్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ ఛాంపియన్. ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషించారు. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మించారు. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ అందుకొని సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సక్సెస్ మీట్ లో హీరో రోషన్, హీరోయిన్ అనస్వర రాజన్ ఆసక్తికర కామెంట్స్ చేశారు.

పీపుల్స్ ఛాంపియన్ సక్సెస్ మీట్ లో హీరో రోషన్ మాట్లాడుతూ.. మీడియా అందరికీ థాంక్యు సో మచ్. ఛాంపియన్ సినిమా నాకు చాలా స్పెషల్. ఈ ప్రాజెక్టుకి నేను ఎమోషనల్ అటాచ్ అయ్యాను. స్వప్న అక్క నాకు ఎంతగానో సపోర్ట్ చేసింది. తనకి సినిమా అంటే చాలా పాషన్ సినిమా కోసం ఏమైనా చేస్తుంది. కిరణ్ గారికి థాంక్యూ, అలాగే జీకే గారికి, మా నిర్మాతలు అందరికీ థాంక్యూ సో మచ్. కళ్యాణ్ చక్రవర్తి గారితో నటించడం ఒక గౌరవంగా భావిస్తున్నాను. ఇప్పటినుంచి ఆయన నటన కొనసాగించాలని కోరుకుంటున్నాను. ఆయన ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డారు. ఆయన మాకు ఒక ఇన్స్పిరేషన్. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను, మిక్కీ గారు బ్లాక్బస్టర్ ఆల్బమ్ ఇచ్చారు. ఆయన పాటలే చాలా పెద్ద ఎత్తున ప్రమోషన్స్ చేసుకుంటూ వెళ్లాయి. ఆయన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదిరిపోయింది. అనస్వర చాలా అద్భుతంగా పెర్ఫార్మ్ చేసింది. తనతో మళ్ళీ కలిసి పనిచేయాలని ఉంది. ఈ సినిమాని ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఛాంపియన్ ఎప్పటికీ నాకు స్పెషల్ ఫిలిం. నాకు ఈ స్క్రిప్ట్ ఇచ్చిన ప్రదీప్ గారికి థాంక్యూ. ఈ సినిమాకి పనిచేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఈ సినిమా మా అందరికీ స్పెషల్. ఇది ఫ్యామిలీ మూవీ. అందరూ కూడా ఫ్యామిలీతో కలిసి వెళ్లి చూడాలని కోరుకుంటున్నాను అని రోషన్ అన్నారు. .

హీరోయిన్ అనస్వర రాజన్ మాట్లాడుతూ.. సినిమాకి అద్భుతమైన విజయాన్ని ఇచ్చి మమ్మల్ని ఛాంపియన్స్ చేసిన ఆడియన్స్ కి థాంక్యూ. ఛాంపియన్ నా మొదటి తెలుగు సినిమా. థియేటర్స్ లో కూర్చుని ఆడియన్స్ రియాక్షన్ చూస్తున్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. ఇలాంటి ఎక్స్పీరియన్స్ ని నేను గతంలో ఎప్పుడూ చూడలేదు. గిరగిరా నా ఫేవరెట్ సాంగ్. మిక్కీ గారు అద్భుతమైన ఆల్బమ్ క్రియేట్ చేశారు. చంద్రకళ పాత్ర ఇచ్చిన ప్రదీప్ అన్నకి థాంక్యూ. సప్న గారి సపోర్ట్ కి థాంక్యూ. సినిమాకి ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ.. అని అనస్వర రాజన్ తెలిపింది.





## మొలకెత్తిన ఉల్లిపాయలు తినొచ్చా? ఒకవేళ తింటే ఏమవుతుంది.

దాదాపు ప్రతి ఇంటి వంటగదిలో ఉల్లిపాయలు కనిపిస్తాయి. శాఖాహారుల నుంచి మాంసాహారుల వరకు అందరూ ఉల్లిపాయలు తింటారు. ఎందుకంటే ఉల్లిపాయలు లేకుండా ఏ వంట పూర్తికాదు. అంతేకాదు ఇవి లేనితే వంటలకు రుచి కూడా రాదు. అందుకే చాలా మంది వీటిని అధిక మొత్తంలో మార్కెట్లో కొనుగోలు చేసి ఇంట్లో నిల్వ చేసుకుంటూ ఉంటారు. కానీ ఎక్కువ రోజులు నిల్వ ఉంచడం వల్ల ఉల్లి మొలకెత్తడం చూస్తూనే ఉంటాం. ఇలా మొలకెత్తిన ఉల్లిని తినడం సురక్షితమేనా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ విధంగా మొలకెత్తిన ఉల్లిపాయలను తినకూడదని కొందరు భావిస్తుంటారు. కానీ మరికొందరు మాత్రం మొలకెత్తిన ఉల్లి ఆరోగ్యానికి చాలా మంచిదని, దీనిని తినడంలో ఎటువంటి సమస్య లేదని చెబుతున్నారు. నిజానికి.. మొలకెత్తిన ఉల్లి తినడం మంచిదా? కాదా? అనే విషయం నిపుణులు మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం..

నిల్వ ఉల్లిపాయలకు వచ్చే పచ్చి మొలకలు విషపూరితమైనవి కావు. నిజానికి ఉల్లిపాయ పాతబడి కొంత తేమను పొందినప్పుడు అది మళ్ళీ మొలకెత్తడం ప్రారంభమవుతుంది. రోజులు గడిచేకొద్దీ దాని నుంచి పచ్చని ఆకు ఉద్భవిస్తాయి. ఈ ఆకులు తినడం ఆరోగ్యానికి మంచిది. భయపడాల్సిన అవసరం లేదని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కానీ ఉల్లిపాయలు తినడానికి సురక్షితమే అయినప్పటికీ వాటి లక్షణాలలో కొన్ని మార్పులు సంభవిస్తాయి. ఉల్లిపాయలు మొలకెత్తినప్పుడు, లోపలి భాగం కొద్దిగా మృదువుగా, లేతగా మారుతుంది.

ఈ ఉల్లిపాయలు సాధారణ ఉల్లిపాయల మాదిరిగా రుచిగా ఉండకపోవచ్చు. వాటికి కొంచెం చేదు రుచి ఉంటుంది. మీరు వంట చేసేటప్పుడు మొలకలను కోసి సలాడ్లు వంటి ఇతర ఆహారాలలో వాడవచ్చు. వాటిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. వాటిని తినడం ఆరోగ్యానికి కూడా మంచిది. కానీ మొలకెత్తిన ఉల్లిపాయ నొక్కినప్పుడు చాలా మృదువుగా లేదా పొడిగా ఉంటే, అలాగే వాటిపై నల్ల మచ్చలు ఉంటే అలాంటి వాటిని ఉపయోగించవద్దు. ఇటువంటి ఉల్లిపాయలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## డయాబెటీస్ రోగులు చిలగడ దుంపలు తినడం మంచిదేనా.

ఈ మధ్యకాలంలో చాలా మంది ఎదుర్కొంటున్న ప్రధాన ఆరోగ్య సమస్యలలో డయాబెటీస్ కూడా ఒకటి. ఈ సమస్యను పరిష్కరించుకోవాలంటే.. సరైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. అయితే ఈ సమ్యను నియంత్రించడం కోసం చాలా మంది బయట మందులను వాడుతుంటారు. కానీ మన రోజువారీ ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా దీన్ని ఈజీగా నియంత్రించవచ్చని చాలా మందికి తెలియదు. అవును చిలకడదుపంను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ వ్యాధిని నియంత్రించవచ్చుట. దీనిలో ఉండే గ్లైసెమిక్ ఇండెక్స్ డయాబెటిస్ ను నియంత్రించడంలో సహాయపడుతుందట. గ్లైసెమిక్ ఇండెక్స్ అనేది ఒక శాస్త్రీయ స్కేల్, ఇది ఒక ఆహారం తిన్న తర్వాత మన రక్తంలో చక్కెర స్థాయిలను ఎంత త్వరగా పెంచుతుందో కొలుస్తుంది. దీని స్కోరు 0 నుండి 100 వరకు ఉంటుంది. తక్కువ (55 లేదా అంతకంటే తక్కువ) ఉన్న ఆహారాలు రక్తంలోకి నెమ్మదిగా గ్లూకోజ్‌ను విడుదల చేస్తాయి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. అయితే, అధిక (70 కంటే ఎక్కువ) ఉన్న ఆహారాలు వేగంగా పెరుగుదలకు కారణమవుతాయి. పోషకాహార నిపుణుడు అవ్ని కౌల్ ప్రకారం, "తక్కువ ఎంపికలను ఎంచుకోవడం మధుమేహ నిర్వహణకు సురక్షితం.

చిలగడదుంప గ్లైసెమిక్ స్కోరుచిలగడదుంపలలో సగటు 44 నుండి 61 వరకు ఉంటుంది, ఇది వాటిని మీడియం- వర్గంలో ఉంచుతుంది. అయితే మనం వాటిని ఎలా ఉగికిస్తున్నామనే దానిపై దాని జీఐ స్కోర్ ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు, కాల్చిన చిలగడదుంపలు ఉడికించిన చిలగడదుంపల కంటే కొంచెం ఎక్కువ కలిగి ఉంటాయి. 150 గ్రాముల ఉడికించిన చిలగడదుంపలో దాదాపు 27 గ్రాముల కార్బోహైడ్రేట్లు, 4 గ్రాముల ఫైబర్, మీ రోజువారీ తీసుకోవడంలో 400 శాతం విటమిన్ ఎ, విటమిన్ సి, పొటాషియం, మెగ్నీషియం ఉంటాయి. ఇందులో బీటా- కెరోటిన్ కూడా ఉంటుంది, ఇది ఆక్సీకరణ ఒత్తిడి, వాపును తగ్గించే యాంటీ ఆక్సిడెంట్. మధుమేహ వ్యాధిగ్రస్తులు చిలగడదుంపలను ఎలా తినాలి రోజువారీ వ్యాయామం, సమతుల్య ఆహారంతో పాటు తగిన మొత్తంలో తిన్న చిలగడదుంపలు మధుమేహ వ్యాధిగ్రస్తులకు ప్రయోజనకరంగా ఉంటాయని పరిశోధనలు సూచిస్తున్నాయి.

## హాఫ్ సెంచరీతో షెఫాలీతో బీభత్సం.

తిరువనంతపురం వేదికగా జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో భారత మహిళల జట్టు సర్వశక్తులూ ఒడ్డి శ్రీలంకను ఓడించింది. అటు బౌలింగ్‌లోనూ, ఇటు బ్యాటింగ్‌లోనూ తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించి 8 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని నమోదు చేసింది.

బౌలర్ల విజృంభణ %-% కుప్పకూలిన లంక..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టుకు భారత పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ చుక్కలు చూపించింది. పవర్‌ప్లేలోనే కీలక వికెట్లు తీసి లంకను కోలుకోలేని దెబ్బ తీసింది. రేణుకా 4 ఓవర్లలో కేవలం 21 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టింది. మరోవైపు స్టార్ స్పిన్నర్ దీప్తి శర్మ 3 వికెట్లతో చెలరేగింది. ఈ క్రమంలోనే టీ20ల్లో 150 వికెట్లు తీసిన తొలి భారత ప్లేయర్‌గా ఆమె చరిత్ర సృష్టించింది. వీరిద్దరి ధాటికి శ్రీలంక 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కేవలం 112 పరుగులు మాత్రమే చేయగలిగింది.

షఫాలీ వర్మ 'మారణహోమం'..

113 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ వీరోచిత ఆరంభాన్ని ఇచ్చింది. మొదటి ఓవర్ నుంచే లంక బౌలర్లపై ఎదురుదాడికి దిగిన షఫాలీ, మైదానాన్ని బౌండరీలతో హోరెత్తించింది. కేవలం 42 బంతుల్లోనే 11 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో 79 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచింది. ఆమె స్ట్రైక్ రేట్ (188.09) చూస్తే లంక బౌలర్లను ఆమె ఎంతలా ఆడుకుందో అర్థం చేసుకోవచ్చు.

భారత్ ఘన విజయం..

షఫాలీ ధాటికి భారత్ కేవలం 13.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి లక్ష్యాన్ని అందుకుంది. స్మృతి మంధాన త్వరగానే అవుట్ అయినప్పటికీ, షఫాలీ జోరుతో భారత్ ఎక్కడా తడబడలేదు. ఈ విజయంతో భారత్ 5 మ్యాచ్‌ల సిరీస్‌ను మరో 2 మ్యాచ్‌లు ఉండగానే 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

క్లినికల్ పర్ఫార్మెన్స్..

ఈ విజయంలో బౌలర్లు వేసిన పునాదిని బ్యాటర్లు సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యంగా ఫీల్డింగ్‌లో కూడా భారత క్రీడాకారిణులు చురుగ్గా కదిలి లంక బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. ఈ విజయంతో భారత జట్టు సిరీస్‌లో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.



## ప్రపంచ రికార్డుతో చెలరేగిన దీప్తి శర్మ.

టీమ్ ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని అందుకుంది. శ్రీలంకతో శుక్రవారం జరిగిన మూడవ టీ20 మ్యాచ్‌లో ఆమె అద్భుతమైన బౌలింగ్‌తో చరిత్ర సృష్టించింది. కేవలం 18 పరుగులు ఇచ్చి 3 కీలక వికెట్లు తీయడం ద్వారా, అంతర్జాతీయ టీ20ల్లో 150 వికెట్ల మార్కును అందుకున్న మొట్టమొదటి భారత ప్లేయర్‌గా నిలిచింది.

ప్రపంచ రికార్డు సమం..

ఈ మ్యాచ్‌లో 3 వికెట్లు తీయడంతో దీప్తి శర్మ మొత్తం వికెట్ల సంఖ్య 151కి చేరింది. తద్వారా ఆస్ట్రేలియా పేసర్ మేగాన్ షట్ (151 వికెట్లు) పేరిట ఉన్న 'మహిళల టీ20ల్లో అత్యధిక వికెట్లు' అనే ప్రపంచ రికార్డును దీప్తి సమం చేసింది. అంతేకాకుండా, అంతర్జాతీయ టీ20ల్లో 1000 పరుగులు, 150 వికెట్లు తీసిన ఏకైక క్రికెటర్‌గా (పురుషుల క్రికెట్‌లో కూడా ఎవరికీ ఈ రికార్డు లేదు) సరికొత్త చరిత్ర లిఖించింది.

రేణుకా సింగ్ నిప్పులు చెరిగే బౌలింగ్..

మరోవైపు, భారత పేసర్ రేణుకా సింగ్ ఠాకూర్ ఈ మ్యాచ్‌లో లంక టాప్ ఆర్డర్‌ను దెబ్బతీసింది. గత కొన్ని మ్యాచ్‌లుగా ఆశించిన స్థాయిలో రాణించని రేణుకా, ఈ మ్యాచ్‌లో తిరిగి ఫామ్‌లోకి వచ్చింది. కేవలం 21 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టి శ్రీలంక బ్యాటింగ్ వెన్నెముకను విరిచింది. ఆమె వేసిన స్వింగ్ బంతులకు లంక బ్యాటర్ల దగ్గర సమాధానం లేకపోయింది.

తక్కువ స్కోరుకే లంక పరిమితం..

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక జట్టు, భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి కేవలం 112 పరుగులు మాత్రమే చేయగలిగింది. లంక బ్యాటర్లలో ఇమేషా దులాని (27), హసిని పెరీరా (25) మాత్రమే కాస్త ప్రతిఘటించారు. కెప్టెన్ చామరి ఆటపట్టు (3)ను దీప్తి శర్మ త్వరగానే పెవిలియన్ పంపడంతో లంక కోలుకోలేకపోయింది.

ప్రస్తుతం దీప్తి శర్మ ఉన్న ఫామ్ చూస్తుంటే, వచ్చే మ్యాచ్‌ల్లో మేగాన్ షట్ రికార్డును అధిగమించి ప్రపంచంలోనే నంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే వన్డే ప్రపంచకప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచిన దీప్తి, ఈ ఏడాది ఐసీసీ అవార్డుల రేసులోనూ ముందంజలో ఉంది.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com